ఆల్‌సోల్స్ డేకు హాజరుకండి


అల్ సోల్స్ డేకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: నవంబర్ 2న నిర్వహించే ఆల్ సోల్స్ డేకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను బన్సీలాల్‌పేట డివిజన్ బోయగూడలోని క్యాథలిక్ గ్రేవ్‌యార్డుకు చెందిన ఫాదర్ ఎం.ఆరోగ్యం, అధ్యక్షుడు జయరాజ్, అలెక్స్, సోలోమన్, రాజన్, జెరాల్డ్ డిసిల్వాలు కలిసి ఆహ్వానించారు.

హాస్పిటల్ నిర్మాణ పనుల పరిశీలన


అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం: అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పరిశీలించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కు వచ్చినప్పుడు ఎటువంటి అయోమయం లేకుండా తక్షణ సేవలు అందేలా అంతర్గత మార్గదర్శక బోర్డులు, విభాగాల సూచికలు స్పష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ ఈ ప్రాజెక్టులో విలీనం కావడంతో, ఇక్కడ టీచింగ్ హాస్పిటల్ కూడా ఏర్పాటవుతోందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు కదిర్వన్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్, వేణుగోపాల్‌రెడ్డి, రామ్, బాలరాజు, హయత్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన యనమల శ్రీనివాసరావు

రాంగోపాల్‌పేట్: బీసీ ప్రజా చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాసరావు బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను సికివిలేజ్‌లోని గాయత్రి గార్డెన్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణను శాలువాతో సత్కరించారు. మంద కృష్ణ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారని కొనియాడారు.

దళితులకు రక్షణేది?


నిరసన తెలుపుతున్న మాల సంఘాల జేఏసీ నేతలు

లాలాపేట: భారతదేశంలో దళితులకు రక్షణ కరువైందని, దానికి నిదర్శనమే సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి అని మాల సంఘాల జేఏసీ, మాల సంఘాల స్టూడెంట్ జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ రాహుల్‌రావు, రాంచందర్, బాలకిషన్, శేఖర్, సైదులు, అంజిబాబు, అర్జున్ తదితరులు ఉన్నారు.

సీజేఐపై దాడి హేయం: కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ యాదగిరి

దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై సనాతన ధర్మం పేరుతో లాయర్ దాడి చేయడాన్ని హేయమైన చర్యగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ యాదగిరి అన్నారు.

దుర్భర స్థితిలో ప్రథమ పారిశ్రామికవాడ

ఎక్కడికక్కడ వ్యర్థాల డంపింగ్
- అస్తవ్యస్తంగా రహదారులు
- అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు


సనత్‌నగర్ పారిశ్రామికవాడలో కుప్పలుగా పడేసిన శిథిల వాహనాలు

సనత్‌నగర్: దేశంలోనే ప్రప్రథమ పారిశ్రామికవాడ ఇప్పుడు సమస్యలతో సతమతమవుతోంది. వివిధ రకాల పన్నుల రూపేణా ఈ పారిశ్రామికవాడ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏటా వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నాయి. వసతులు, సౌకర్యాలు కల్పించడం మాట దేవుడెరుగు.. కొత్తగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఒక్కసారి పారిశ్రామికవాడ రహదారులను చూస్తే ఇది డంపింగ్ యార్డా.. లేక పారిశ్రామికవాడనా? అన్న అనుమానం కలగక మానదు. ఏ రోడ్డులో కెళ్లినా చెత్తా చెదారం, భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌తో పాటు శిథిల వాహనాలు దర్శనమిస్తుండడమే ఇందుకు కారణం. ఇక భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌కు ఈ రహదారులు అడ్డాగా మారిపోయాయి. రాత్రయ్యిందంటే వెలగని వీధిదీపాలతో చీకట్లు అలుముకొని అసాంఘిక శక్తులు మేల్కొంటాయి.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

1948లో హైదరాబాద్ విలీనం తర్వాత సనత్‌నగర్ ప్రాంతంలోని అల్లావుద్దీన్ అండ్ కంపెనీకి చెందిన 408 ఎకరాల భూమిని రాష్ట్రపతి స్వాధీనం చేసుకున్నారు. అందులోని 150 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను కేంద్ర కార్మిక సంస్థ ఆహ్వానించింది. ఆ ప్రాంతానికే సనత్‌నగర్ పారిశ్రామికవాడగా పేరుపెట్టారు. మొట్టమొదటి కార్మిక శాఖ మంత్రి జగ్జీవన్‌రామ్ చేతుల మీదుగా ఈ పారిశ్రామికవాడ ప్రారంభమైంది. ఆ తర్వాత అల్విన్ కంపెనీ తన ఉత్పత్తులను ప్రారంభించింది. శక్తిమాన్ ట్రక్స్, బస్సు బాడీలు తయారుచేయడం మొదలైంది. ఇక్కడ బెక్లెట్ హైలాం, ఫర్నీచర్ ఇండస్ట్రీ, దక్కన్ మెటల్ వర్క్స్, ఈసీఐఎల్, బీడీఎల్, చైన్ ఫ్యాక్టరీ.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో బడా కంపెనీలు సనత్‌నగర్‌లో అడుగుపెట్టాయి. ఆ తర్వాత మెటల్‌వర్క్స్ ఆగ్రోమెక్ స్టీల్ పరిశ్రమగా మారింది. ఫార్మా కంపెనీలైన హెటిరో డ్రగ్స్, నాట్కో రీసెర్చ్ సెంటర్, బ్రైట్ స్టార్ రబ్బర్, దివీస్, సిప్రా, గ్లాండ్‌ఫార్మా, ల్యాంకో వంటి బడా కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలను సనత్‌నగర్ పారిశ్రామికవాడలో కొనసాగించారు. 200 వరకు బడా, ఛోటా కంపెనీలు ఇక్కడ ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం చాలా వరకు కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలిపోయినప్పటికీ కొన్ని ఫార్మా సంస్థల కార్పొరేట్ కార్యాలయాలు, ఫర్నీచర్ ఇండస్ట్రీస్‌తో పాటు చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలు ఇంకా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. వీటితో పాటు పోస్టాఫీసు, బ్యాంకింగ్ సేవలు ఇక్కడ అందిస్తున్నారు. ఆయా కంపెనీల ద్వారా ఏటా వందల కోట్ల రూపాయలు ట్యాక్స్‌లు చెల్లిస్తుంటారు. అయితే ఇక్కడ వసతులు మాత్రం అరకొరగానే ఉన్నాయి. ఎక్కడెక్కడి నుంచో భవన నిర్మాణ వ్యర్థాలను గుట్టలుగా పారబోస్తూ డంపింగ్‌యార్డుగా మార్చేశారు. ఇక పాడుబడి శిథిలావస్థలో ఉన్న వాహనాలు పడేసేందుకు కూడా ఈ పారిశ్రామికవాడనే దిక్కు. ఎటుచూసినా చెత్తా చెదారమే దర్శనమిస్తూ పారిశుద్ధ్య సమస్య రాజ్యమేలుతోంది. ఇక్కడి ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు దుర్గంధ భరితంగా మారిన రహదారులపైనే అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు.


పారిశ్రామికవాడ రహదారుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు

వాహనాల అక్రమ పార్కింగ్‌కు నెలవుగా..

రోడ్డు పక్కన శిథిల వాహనాలను నిలిపి ఉంచడంతో పాటు రహదారులకు ఇరువైపులా రోజుల తరబడి భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు కూడా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోంది. సనత్‌నగర్ ప్రధాన రహదారి నుంచి పారిశ్రామికవాడకు వెళ్లే రెండు మార్గాల్లో ఇరువైపులా లారీలు, ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు చెందిన భారీ వాహనాలు, కంటైనర్లను నిలిపి ఉంచుతున్నారు. జీజీపీసీబీ భవనం వెనకవైపు పాడైపోయిన లారీలు, కార్లను ఏళ్ల తరబడి అక్కడే ఉంచుతున్నారు. తక్కువగా మారిన కార్లు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటోలను కూడా ఈ పారిశ్రామికవాడ రహదారులపైనే ఉంచుతున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా శిథిల వాహనాల వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ఈ పారిశ్రామికవాడ నిర్వహణను జీహెచ్ఎంసీ పర్యవేక్షిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు కీలకమైన పారిశ్రామిక ఉత్పత్తులకు చిరునామాగా ఉన్న సనత్‌నగర్ ప్రస్తుతం దీనస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి పారిశ్రామికవాడలో సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెంచిన బస్సు ఛార్జీలను తగ్గించే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడతామని పేర్కొన్నారు. ఛార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 9న నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బస్‌భవన్‌కు చేరుకొని వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు.

రేతిఫైల్ బస్టాండ్ నుంచి తలసాని..

ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులో బస్‌భవన్ వరకు వెళ్తారు. అక్కడ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులతో కలిసి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేస్తారు.

ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్‌లో హైదరాబాద్ గ్రూప్ విజేత



లాలాపేట: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్ శిబిరంలో పాల్గొన్న హైదరాబాద్ గ్రూప్ అన్ని విభాగాల్లో ఓవరాల్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కమాండర్ కల్నల్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులకు సామాజిక బాధ్యతతో పాటు సాహసం ఉండాలన్నారు. ఇటీవల గుంటూరు జిల్లా చౌడవరంలో నిర్వహించిన ఈ శిబిరంలో 510 మంది క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు. దీనికి లెఫ్టినెంట్ డాక్టర్ పల్నాటి నరేశ్, హిమబిందు అధికారుల పర్యవేక్షణలో హైదరాబాద్ గ్రూపు నుంచి 60 మంది క్యాడేట్లు పాల్గొన్నారు. కోటప్పకొండ, కొండవీడు, విజయవాడ కొండపల్లి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ నిర్వహించారు. దీంతో పాటుగా టగ్ ఆఫ్ వార్, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అంశాలపై ప్రదర్శన, ఇతర అంశాల్లో పోటీలు నిర్వహించారు. వీటన్నింటిలో హైదరాబాద్ గ్రూప్ ఓవరాల్ విజేతగా నిలిచింది. విజేతలకు గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ సుహాస్ దుబే, కల్నల్ ఉదయ్ కుమార్‌లు ట్రోఫీలను అందజేశారు. హైదరాబాద్ గ్రూప్‌ను విజేతగా నిలిపిన అధికారులను 3వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ ఏమైంది


కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ కార్డు అనే చెక్కును ఆటో డ్రైవర్లకు అందిస్తున్న క్రిశాంక్

రాంగోపాల్‌పేట్: ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ఏమైందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన లక్ష్మీనగర్‌లో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రెండేళ్లకు సంబంధించి రూ.24 వేలు బాకీ ఉందంటూ రేవంత్‌రెడ్డి పేరు మీద చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడచిపోవడంతో రూ.24వేలు ఆటో డ్రైవర్లకు చెల్లించాల్సి ఉందని, దీన్ని ఆటో డ్రైవర్లు అందరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దపు హామీలు ఇచ్చి వాటిని పూర్తిగా విస్మరించి ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం


రాజేశ్వరి

అడ్డగుట్ట: స్వగ్రామానికి వెళ్లేందుకు భర్తతో కలిసి రైల్వే స్టేషన్‌కు వచ్చిన భార్యపిల్లలు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌లోని కివారా పలికి చెందిన ప్రకాష్ చౌదరి, రాజేశ్వరి(23)లు భార్యభర్తలు. వీరికి 18 నెలల కుమార్తె ఉంది. నాలుగు నెలల క్రితం రాజేశ్వరి తన కూతురితో కలిసి నగరంలోని ఫలక్‌నుమాలో నివాసముంటున్న తన తల్లి ఇంట్లోనే ఉంటుంది. తన భార్యపిల్లలను తీసుకెళ్లేందుకు ఈ నెల 3న ప్రకాష్ చౌదరి ఫలక్‌నుమాకు వచ్చాడు. ఈ నెల 6న రాజాస్థాన్‌కు వెళ్లేందుకు భార్య పిల్లలను తీసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఉదయం 6 గంటల సమయంలో రైల్వే స్టేషన్ బయట టిఫిన్ చేసి వస్తానని భర్తకు చెప్పి కూతురితో వెళ్లిన రాజేశ్వరి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో ప్రకాష్ రైల్వే స్టేషన్ బయట, ప్లాట్‌ఫామ్‌ల్లో భార్యాపిల్లల కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం


మిస్బాసుల్తాన

చిలకలగూడ: బాలిక అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌గూడకు చెందిన మిస్బాసుల్తాన (17) గతనెల 29న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాలతో పాటు సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తండ్రి షేక్‌మజీద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

బీసీల అభివృద్ధికి రూ. లక్ష కోట్లు ఖర్చుచేస్తాం

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీ ప్రభుత్వం రాగానే మొదటి సంవత్సరమే బీసీల అభివృద్ధి కోసం రూ.లక్ష కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫోరం వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కె.మురళీ మనహర్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓపెన్ టాక్ విత్ మల్లన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు మల్లన్న సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తెలంగాణ వచ్చిన 12 సంవత్సరాల్లో బీసీలకు రూ. 45 వేల కోట్లు కేటాయింపులు జరిగితే ఖర్చు చేసింది మాత్రం కేవలం రూ.24 వేల కోట్లు మాత్రమే అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న చిత్తశుద్ధి మొదట పాలకవర్గానికి ఉండాలన్నారు. నిజంగా ఉంటే తమిళనాడు తరహాలో ఢిల్లీలో పోరాడి రిజర్వేషన్లు సాధించే వారన్నారు. కార్యక్రమంలోఫోరం ప్రతినిధులు దేవళ్ళ సమ్మయ్య, కొండల్ రావు, నగేష్ భూషన్, జ్వలిత, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, తుల్జా రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీగణేశ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది బీజేపీనే’


మాట్లాడుతున్న మల్లికార్జున్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది బీజేపీ పార్టీయేనని, దాన్ని విస్మరించి ఇప్పుడు ఓట్ కా చోరీ గురించి ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్ విమర్శించారు. బీజేపీ ఓట్ కా చోరీకి పాల్పడి ఉండే తమ పార్టీకి గత ఎన్నికల్లో 400 సీట్లు రావాలని కదా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రెండు మార్లు శ్రీగణేశ్ బీజేపీ సీటుపై కంటోన్మెంట్ నుంచి పోటీ చేస్తే వచ్చిన ఓట్లను చూసి రేవంత్‌రెడ్డి పిలిచి ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. కంటోన్మెంట్‌లో ఓటుకు రూ.2వేలు ఇచ్చి గెలిచింది నీవే కదా, ఎక్కడ వెళ్లినా ప్రజలు ఇదే అంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు విజయానంద్, శ్రీకాంత్, శంకర్, కిరణ్‌కుమార్, ప్రవీణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాగ్నిస్ సంస్థ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: సామాజిక బాధ్యతగా ఖరీదైన వైద్య పరీక్షలను నిరుపేదలకు ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న మ్యాగ్నిస్ సంస్థ సేవలు అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎస్ఆర్‌నగర్‌లోని మ్యాగ్నిస్ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉచిత వైద్య పరీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ద్వారా ఆర్థికంగా వెనుకబడ్డ వయోవృద్ధులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న అనాథలు, మురికివాడల్లో ప్రజలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఖరీదైన వైద్య పరీక్షలు చేయడం సంతోషదాయకమని చెప్పారు. కోవిడ్ కష్టకాలం నాటి నుంచి ఇప్పటి వరకు 1200లకు పైగా ఉచిత శిబిరాలు నిర్వహించేలా సంస్థ అధినేతల, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావు చొరవ చూపారని తెలిపారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కాసాని సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఏఎస్ ప్రమోషన్స్‌లో అధ్యాపకులకు అన్యాయం


నిరసన వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ అధ్యాపకులు

లాలాపేట: ఇటీవల నిర్వహించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం(సీఏఎస్) ఇంటర్వ్యూల్లో ఓయూలో 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ లభించక తీరని అన్యాయం జరిగిందని ఔటా అధ్యక్షులు ప్రొఫెసర్ మనోహర్ ఆరోపించారు. బుధవారం సీఏఎస్ ప్రమోషన్స్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పలువురు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓయూ అధికారులు సీఏఎస్ ఇంటర్వ్యూలు సరిగ్గా చేయలేదని పేర్కొన్నారు. గడచిన 50 ఏళ్లలో ఇప్పటి వరకు సీఏఎస్ ఇంటర్వ్యూల్లో అధ్యాపకులను రిజెక్ట్ చేసిన దాఖలా లేదన్నారు. ఏకగా 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా చేయడం దారుణం అన్నారు. ఉత్తమ అధ్యాపకులకు, ఉత్తమ పరిశోధకులకు సైతం అన్యాయం జరిగిందని వివరించారు. కానీ ఎలాంటి పనితీరు లేని కొంత మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హత కలిగిన ప్రతి అధ్యాపకుడికి ప్రమోషన్ ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, నతానియేల్, వెంకటదాస్ తదితరులు ఉన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్తాచాటిన క్రీడాకారులు


పతకాలు సాధించిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ క్రీడాకారులు దక్షిణాది రాష్ట్రాల మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో సత్తచాటారు. బెంగుళూరులో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో 40 ఏళ్ల విభాగం మహిళల సింగిల్స్‌లో బి.కిరణ్మయ్ బంగారు పతకం, సోనల్ అగ్రానీ కాంస్య పతకాన్ని సాధించారు. 50 ఏళ్ల పరుషుల సింగిల్స్‌లో ఆర్ జె. హరికృష్ణ కాంస్యం, 60 ఏళ్ల మహిళల సింగిల్స్‌లో సుకన్య రజతం, 65 ఏళ్ల పురుషుల సింగిల్స్‌లో ఎన్. తాహెర్ స్వర్ణం, మహిళల డబుల్స్‌లో సోనల్ అగ్రానీ రజత పతకాలను సాధించారు. బుధవారం ఈ సందర్భంగా ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి దయాకర్ కుసుమ, బేతి విఠల్ తదితరులు మాట్లాడుతూ.. పతకాలు సాధించిన విజేతలను అభినందించారు.

నకిలీ వైద్యుడి అరెస్టు..

బంజారాహిల్స్: రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుణ్ణి జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో నివసించే నీలి శశిధర్ (32) డాక్టర్‌గా చెలామణీ అవుతూ రహమత్‌నగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను గత కొంతకాలంగా నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్నాడు. ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ లాగా ప్రిస్కిప్షన్లు రాస్తూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోగులను చీటింగ్ చేస్తున్నట్లు కూడా గుర్తించారు. అంతేకాకుండా సమీపంలో శ్రీనివాస్ అనే వ్యక్తితో మెడికల్ షాపు కూడా తెరిపించాడు. శశిధర్ రాసిన మందులను శ్రీనివాస్ విక్రయించేవాడు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు నీలి శశిధర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లినిక్‌లో పెద్ద ఎత్తున మందులను, వైద్య సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఆధ్యాత్మికశోభతో స్కందగిరి ఆలయం

- వైభవంగా ప్రారంభమైన జనార్ధనానందసరస్వతీస్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవాలు


రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతీ స్వామి

పద్మారావునగర్: సుప్రసిద్ధమైన స్కందగిరి దేవాలయంలో బుధవారం శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలు, 25వ తెలంగాణ వేద విద్వన్మహాసభలు అట్టాహాసంగా ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున తెలంగాణ ప్రాంత వేద శాస్త్ర విద్వాంసులు, వేద విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. వేదమంత్రోచ్ఛరణ మధ్య ఆధ్యాత్మికశోభతో స్కందగిరి దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతీస్వామి, శ్రీ జనార్ధనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ అహ్వాన సంఘం అధ్యక్షుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం(రిటైర్డ్ ఐఏఎస్), చైర్మన్ తూములూరి శాయినాథశర్మ, ప్రధాన కార్యదర్శి పసుమర్తి బ్రహ్మానంద శర్మ, చింతపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఉదయం గణపతి, గోపూజ నిర్వహించారు.

సీజేఐపై దాడిని కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి

ఈ నెల 9 నుంచి 10 రోజుల పాటు నిరసనలు: మంద కృష్ణ మాదిగ



రాంగోపాల్‌పేట్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని లోతైన దర్యాప్తు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. బుధవారం సిక్‌విలేజ్‌లోని గాయత్రి గార్డెన్‌లో ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి దేశంలోని దళితులందరిపై జరిగిన దాడిగా, రాజ్యాంగంపై జరిగిన దాడిగా, ప్రజాస్వామ్యంపై, న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా తాము భావిస్తున్నామన్నారు. దాడి జరుగగానే ప్రధాని మోదీ జస్టిస్ గవాయ్‌ని పరామర్శించి, ఖండించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా సూమోటాగా కేసును తీసుకొని దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనను నిరసిస్తూ ఈ నెల 9 నుంచి 19 వరకు 10 రోజుల పాటు దేశ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ వివిధ రూపాల్లో శాంతియుతంగా నిరసనలకు పిలుపునిస్తుందన్నారు. దీనికి దళిత, బహుజన, గిరిజన, మైనార్టీ వర్గాలతో పాటు ప్రజాస్వామికవాదులందరూ కలిసి గ్రామ, మండల, జిల్లాల్లో నిరసనలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోవింద్ నరేష్, టీవీ నరసింహ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, ఇటిక శ్రీకిషన్ మాదిగ, అజిత్ వాల్మీకి, మల్లికార్జున్ మాదిగ, అనిల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379